# సేద తీరిన మనసు

తెల్లవారుతూనే ఆ కబురు ఒకరింటినుంచి ఒకింటికి.... ఒకరినించి మరొకరికి పాకిపోయింది. చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళంతా ఆ డాబా ఇంటి ముందు చేరుతున్నారు. కొందరు లోపలికెళ్ళి చూసి బయటికి వొస్తుంటే మరికొందరు లోపలికెళ్తున్నారు. బయటికి వొచ్చేవారి మొహాల్లోనూ..... లోపలికెళ్ళేవారి మొహాల్లోనూ ఒకే రకమైన భావం తారట్లాడుతోంది.... అది విచారం... ఇద్దరివీ విచారవదనాలే. కానీ.... మొత్తమ్మీద వాళ్ళందరి అభిప్రాయమూ ఒకటే.... జగదాంబ అదృష్ట జాతకురాలు. దర్జాగా బతికింది.... బోలెడు చీరలు.... బోలెడు నగలు.... మంచిభర్త... ముత్యాలాంటి ముగ్గురు పిల్లలు... అబ్బో... ఇంతకంటే అదృష్ట ఎవరికుంటుంది? అందరూ గట్టిగా ఇదే మాట్లాడుకుంటున్నారు. అందరినోటా ఇవేకబుర్లు... ఇవే మాటలు...

వాళ్ళందరి మాటలూ జగదాంబ చెవిని పడుతూనే ఉన్నాయి. గుడ్లప్పగించి వచ్చే పోయేవారి వంక చూస్తోంది. ఆవిడకి మాట పడిపోయి వారం రోజులైంది. నెల్లాళ్ళుగా మంచానపడుంది. ఆవిడకొచ్చిన అనారోగ్యం డాక్టర్లకి అంతు చిక్కట్లేదు. టెస్టులమీద టెస్టులు చేస్తూనే ఉన్నారు. క్రితంరోజు సాయంత్రం నుంచీ మరింత క్షీణదశ మొదలైంది. తెల్లారకుండానే మళ్ళీ ఓ సారి డాక్టరొచ్చి చూశాడు. ఇంక ఆమె ప్రాణం ఉండేది కొద్ది గంటలు మాత్రమే అని చెప్పి వెళ్ళాడు. ఆ కబురు తెలిసే ఆ హడావిడి ఆ ఇంటిముందూ... ఇంట్లోనూ....

ప్రాణం పోయేముందు కొందరికి చావు తెలివి వస్తుందంటారు... మాటైతే పడిపోయిందిగానీ తన మనసు పడిపోలేదు... కానీ.... మామూలుగా ఉన్న రోజుల్లోనే ఎవరికీ కనిపించని తన మనసు ఇప్పుడు... ప్రాణాలు గాల్లో కలవబోతుంటే ఎందుకు కనిపిస్తుంది? ఎలా కనిపిస్తుంది? ఈ కట్టె కనపడుతుంది గానీ కట్టెలోపలి

సున్నితమనసు ఎవరికి కనబడుతుంది.... తనకి తానే చెప్పుకుంటోంది. లోలోపల జగదాంబ తన అనారోగ్యకారణం తనకే తెల్సు మనసు ముక్కలై జీవితమ్మీద ఆసక్తి చచ్చిపోయి సరిగ్గా తిండి తినడంఏనాడో మానేసింది తను. భర్తకీ పిల్లలకీ అక్కర్లేని తను.. తనక్కావల్సినదాన్ని ఆహ్వానించుకుంది... అదే... మృత్యువు..

యాభయ్యేళ్ళంటే అదేమంత పెద్దవయసుకాదు అందుకే.. ఆవిడ ఏ కొరతాలేకుండా... ఏ చీకూచింతా లేకుండా.... తన ఇష్టారాజ్యంగా దర్జాగా బతికింది అని చెప్పుకుంటున్న వాళ్ళంతా ఈ మాటకూడా అనుకుంటూనే ఉన్నారు... పెద్ద వయసేం కాదని... కానీ... ఆవిడకొచ్చిన జబ్బు అంతుపట్టని పెద్ద జబ్బే... యాభయ్యేళ్ళకే నూరేళ్ళూ నిండిపోతున్నాయి... మనోవ్యాధికి మందులేదన్న మాట నిజమైపోతుందా?

★★ ★★ ★★

"నాఫ్రెండ్సుని నలుగురైదుగుర్ని భోజనానికి పిల్చాను. వంట మంచి రుచిగా ఫస్టు క్లాసుగా రకరకాలు చెయ్యి." కొత్త పెళ్ళికూతురు జగదాంబ కాపరానికొచ్చిన రెండో రోజే భర్త అలా చెప్పేసరికి తెల్లబోయింది.

"మావాడు శంకరం అనొకడున్నాడులే.... వాళ్ళావిడ వంటకంటే నీ వంట చాలా చాలా బావుండాలి... ముందే చెప్తున్నాను.... ఎక్కడాతేడా రాకూడదు...." ఆ గొంతులో అథారిటీ... హెచ్చరిక.... తేడా వొస్తే తంతానన్న కర్కశత్వం... కనిపించాయి. వినిపించాయి. జగదాంబకి. కాపరానికొచ్చిన కొత్త పెళ్ళి కూతురికి 'భర్తంటే భయం' అన్న అర్థం స్థిరపడిపోయింది. మనసులో...

ఆమెలో మనోవ్యాధికి తొలిమెట్టు ఆ రోజే పడిందన్న విషయం ఎవరికి తెలుసు? ఆమెకీ తెలియదాయె.....

రాను రాను భర్త స్వభావం బాగా అర్థంకావడం మొదలైంది ఆమెకి. అతనికి తనచుట్టూ భట్రాజులుండాలి... అది మెయిన్ టెయిన్ చెయ్యడం కోసం అప్పులు చేస్తూ ఉంటాడు. ఒక అప్పు తీర్చడం కోసం మరొక చోట అప్పు... అది

తీర్చడం కోసం మరొక చోట... ఇలా సాగి పోతోంది. అతని పద్ధతి... కీర్తి కాంక్షతో అతను రగిలిపోతున్న విషయం ఆమెకి బోధపడేనాటికి అతన్లో అది ముదిరిపోయింది.

"ఛీ.....ఛీ.... ఇదేంరంగు? ముందా చీరా మార్చు...." ఆజ్ఞలాంటి అరుపుకి బిక్క మొహంవేసింది, విసుగ్గా చూశాడు మహేశ్వర్రావు. "బావుంది కదండీ... ఈ రంగంటేనాకు చాలా ఇష్టం" భయం భయంగా మెల్లిగా వొచ్చింది నోట్లోంచిమాట. అన్ని రంగుల్లోకీ తన కెంతో ఇష్టమైన రంగు లేతాకుపచ్చరంగు. "చంపావుపో... నాకస్సలిష్టంలేని రంగు ఇది. ఎప్పుడూ ఈ రంగు బట్టలు కట్టుకోకు నీకు చీరలు నేనే కొనుక్కుని తీసుకొస్తూ ఉంటాను నాకు నచ్చిన రంగులవి. నువ్వు మాత్రం పొరపాటున కూడా షాపింగ్‌కి వెళ్ళడానికి వీల్లేదు. గుర్తుంచుకో."

"కూరలూ పళ్ళూ ఇంట్లోకి ఏ సరుకు కావాలన్నా... కొనాలో అక్కర్లేదో నేనే ఆలోచించుకుని బజార్నుంచి నేనే పట్టుకొస్తాను నువ్వెళ్ళడానికి వీల్లేదు... ఇంటి దగ్గర అమ్మకానికి వచ్చినా కూడా నువ్వు కొనడానికి వీల్లేదు... ఒక్కపైసాకూడా ఖర్చు పెట్టడానికి వీల్లేదు గుర్తుంచుకో...."

హెచ్చరికలే ఆమె పాలిట మేలుకొలుపులు....

హెచ్చరికలే ఆమె పాలిట లాలి పాటలు...

తన కత్యంత ఇష్టమైన సపోటాపళ్ళు.... ఒక సీజన్లో మాత్రమే వొస్తాయి...

ఏడాది పొడుగునా రమ్మన్నారావు... అతని కిష్టం లేదా పళ్ళు.. తినడు... అందుకే.. సపోటాలసీజనొస్తే సపోటాలు తినకపోతే కొంపలేంమునిగిపోవు అన్న డైలాగు ఆ ఇంట్లో వినిపిస్తుంది తప్ప ఆ పళ్ళు మాత్రం ఆ ఇంట్లోకి రావు.

ఓ బిక్కమొహం... ఓవెర్రినవ్వు కలిపితే అయ్యింది జగదాంబ రూపం "నీకేవమ్మా! చక్కగా మీ ఆయనే నీకు చీరలు కొని తెస్తాడు... ఇంట్లో సరుకులు తెస్తాడు... నువ్వు కాలు బయటపెట్టనక్కర్లేదు. నీ అంత అదృష్ట వంతురాలెవ రుంటారు?" ఇరుగు పొరుగు ఆడవాళ్ళు బంధువులు ఆ మాట అన్నప్పుడల్లా ఓ వెర్రినవ్వు నవ్వుతుంది.

ఆ వెర్రి నవ్వుతోనే.... ఆ బిక్క మొహంతోనే ముగ్గురు పిల్లల్ని కన్నది. ఇద్దరు మొగపిల్లలు.... ఒక ఆడపిల్ల.

పెరట్లోపూలమొక్కల మధ్య తిరుగుతుంటే ఈ లోకమేమర్చిపోయింది. జగదాంబ... ఈ మొక్కల్లో తానూ ఒ మొక్క అయిపోతే ఈ పూలల్లో తానూ ఒక పువ్వు అయిపోతే....

ఆకులో అకునై.... పూవులో పూవునై.... నును లేత రెమ్మనై... కృష్ణశాస్త్రి గేయమే అయ్యిందామె మనసు.

"మీ మెళ్ళో గొలుసు కొత్తదిలా ఉందే? బావుందండీ....." పెరటిగోడ దగ్గర పక్కింటావిడ పలకరింపుతో ఈ లోకంలో కొచ్చింది. నిర్లిప్తంగా తన మెడవంక చూసుకుంది.

"కృష్ణశాస్త్రి కవిత కంటే బావుందా?" అప్రయత్నంగా పైకే వొచ్చిందామాట.

"ఆ... ఏమిటంటారూ?" అడిగిందావిడ.

"అబ్బే! ఏంలేదండీ!

తను గొలుసుకొనమని అడగలేదు.... కొనేముందు ఆయన చెప్పనూలేదు.

"ఆర్డరిచ్చి చేయించారా?"

"లేదండీ....షాపులో రెడీగా ఉన్న వాటిల్లోంచే కొన్నారు. ఆయనే తెచ్చారు. ఏ షాపోకూడా నాకు తెలియదు."

"ఎంతో అదృష్ట వంతులకి తప్ప మీ ఆయనలాంటి భర్త దొరకరు"

అదృష్టం కాదు... అప్పుకనపడుతోంది జగదాంబ కళ్ళకి.

"ఇప్పుడెందుకండీ ఈ గొలుసు?" భయంగా చూసిందారోజు.

"వాళ్ళావిడ కోసం పండక్కి గొలుసుకొనడానికి నగలషాపుకెళ్తూ నన్ను తోడురమ్మన్నాడు మూర్తి. నాకంటే తక్కువ జీతగాడు వాళ్ళావిడకి బంగారం

కొంటుంటే పక్కన దేభ్యం మొహం వేసుకుని నిలబడతానా? గొప్పలు చూపించు కోవద్దా నేను మాత్రం? వాడుకొనేదాకా ఆగి దానికంటే ఎక్కువ ఖరీదుగొలుసు నీకోసం తీసుకున్నాను." అతని మాటల్లో అక్షరం అక్షరం లోనూ దర్పం తొంగిచూసింది. చివుక్కుమంది ఆమె మనసు. అత్యవసరంగా ఏదో చెప్పాల్సివొచ్చి... ఎప్పుడు ఫోన్ చెయ్యని తను... ఒక సారి పుట్టింటికి ఫోను చేస్తే.....ఎస్.టి.డి. అంటే మాటలా నోరు మూసుక్కోమన్న ఈ మనిషి... ఊళ్ళోవాళ్ళముందు గొప్పలకోసం బంగారం కొన్నాడు.

"అంత డబ్బు ఇప్పుడెక్కడిదండీ?" మనసులో బాధ అడిగే ధైర్యం ఇచ్చినట్టుంది.

"బయల్దేరే ముందు ఒకడి దగ్గర అప్పు తీసుకుని వెళ్ళాన్లే లేకపోతే అంత డబ్బు నా దగ్గరెక్కడుంది?"

"అప్పు అన్న ఆ పదం ఆమె నెత్తిన సుత్తి దెబ్బ.

డాబుసరికి పోయి చీటికీ మాటికీ ఆమె నెత్తిన సుత్తి దెబ్బలేస్తూనే ఉన్నాడు.... వేస్తూనే ఉంటాడు....

ఆ గొలుసు వేసుకోవడానికి మనస్కరించలేదు... తీసికెళ్ళిలోపల దాచింది. ముగ్గురు పిల్లలు... ఒక్క మనిషి రెక్కల ఆధారం... పిల్లల జీవితాలకి మంచి బాట వెయ్యాలావొద్దా? వాళ్ళనోగట్టున పడెయ్యాలావొద్దా? సూది మొనంత మొదలై కొండల్లా పెరుగుతున్నాయి అప్పులు అప్పులిచ్చినవాళ్ళు ఎవరో ఒకళ్ళు ప్రతిరోజూ ఫోన్లు చేస్తూనే ఉంటారు. ఇంట్లో లేరని చెప్పిస్తాడు. తన చేత ఎందుకొచ్చిన దొంగబ్రతుకు?

"కొని పెట్టకపోతే ఏడిచే మొహాలుంటారుగానీ.. కొనిస్తే ఏడిచే మొహం ఉండదునీలాగా." ఇంతెత్తున లేచాడు. నేనంటే లెక్కలేదన్నాడు. కొట్టినంత పనిచేశాడు. సాధింపులు వినలేక పోయింది. కళ్ళల్లో నీళ్ళుదాచుకుంటూ వెళ్ళి... గొలుసు తీసుకొచ్చి అతని ఎదురుగానే మెడలో వేసుకుంది. పురుగేదో మెడమీద

పడిపాకుతున్నట్టనిపించింది. ఒకప్పుడు ఆస్తిపాస్తులున్న కుటుంబం అయితే కావచ్చుకాక.. తాతలకాలం అది. ఇప్పుడు నేతులవాసనెక్కడుంది? ఆ జమీందారీ గొప్పలు చూపించుకుంటూ బతుకుతానంటే ఎలా కుదురుతుంది? ఇంకా పొగడ్తల స్తోత్రం ఆపలేదు పక్కింటావిడ "అడక్కుండానే అన్నీ అమర్చే భర్త... రత్నాలాంటి పిల్లలు... తండ్రంటే ఆ పిల్లలకి ఎంత భక్తి ఎంత భక్తి...."

అది భక్తి కాదు... భయం.... భయం... భయం..... పెద్దగా అరవాలనుకుందికానీ.. ఆశరీరాన్ని శాశ్వతంగా గుత్తకి పుచ్చుకున్న వెర్రినవ్వు అరుపుని గొంతులో నొక్కేసి పెదాలమీదకి దూకేసింది.

కీర్తి గౌరవం అన్నవి మనమంచి నడతవల్ల మనమీద ఇతరుల్నించి.... అవంతట అవి పుట్టుకురావాలిగానీ... మాటి మాటికీ బోజనాలకిపిల్చి మేపడంవల్ల గానీ.... డబ్బులు వెదజల్లడం వల్లగానీ మొహమాటాల్తో కొనుక్కునేది గానీ నిజమైన కీర్తి గౌరవాలు కావని తన అభిప్రాయం చెప్పినందుకు... ఆ కోపం తన మీద చూపించేందుకు అతను ఎన్నుకున్న మార్గం ఆమెని జీవచ్ఛవం చేసింది. పిల్లలకి తల్లి అంటే అయిష్టం ఏర్పడేలా... పిల్లలు ఏవిషయంలోనూ తల్లిమాట వినకుండా ఉండేలా ప్రయత్నాలు చేసి ఆ రకంగా వాళ్ళతో మాట్లాడుతూ విజయం సాధించాడు.

"మీరు సైకియాట్రిస్టుని కన్సల్టు చెయ్యడం మంచిదేమో" ఈమాట రోజుకోసారైనా ఆమెనోటి చివరిదాకావొచ్చి... వెర్రినవ్వు ముందు ఓడిపోయి... బయటికి రాలేకపోయేది.

తలుపులు కొట్టిన చప్పుడైంది. వొస్తున్నానంటూ జవాబిచ్చి తలుపుతీసింది. ఎదురుగా రఘుపతి గారు.

"ఆయన ఇంట్లో లేరండీ..."

"తెలుసమ్మా. క్లబ్‌లో ఉన్నాడు అక్కడినించే వొస్తున్నాను. మీ ఇంట్లో టి.వి. మా క్లబ్‌కి విరాళంగా ఇస్తానని ప్రకటించాడు. ఇప్పుడే తీసుకురమ్మని నన్ను పంపించాడు. ఆటో తీసుకొచ్చాను...."

తనతో ఒక్కమాట కూడా అనలేదే...

"క్లబ్‌లో అందరూ ఆయన్ని పొగట్టవేసనండీ..."

ఆయనక్కావల్సిందదేగా... మూలిగింది మనసు...

"తీసికెళ్ళండి" చెదిరిపోకూడని వెర్రినవ్వు చటుక్కున పెదాల మీదికి చేరిపోయింది.

మర్నాడే ముందుగదిలోకి కొత్త టి.వి. వొచ్చేసింది. జగదాంబ కది టి.వి లాగ కనిపించలేదు. వంది మాగధులు ఉబ్బించి భుజాల కెత్తుకుని కౌన్సిలర్ పోటీకి నిలబడమంటే తనంతవాడు లేడనుకున్నాడు. ఇల్లు తాకట్టు పెట్టి మరీ తయారైపో యాడు. నెత్తికి చేతులే మిగిలాయి. నువ్వు గెల్చి తీరతావు. ఢో కాలేదు. నిలబడమని... చెప్పిన ఆ జ్యోతిష్యుడి మీద మండి పడటంలో అర్థం లేదనిపించింది. జగదాంబకి. ఎవరి బుద్ధీబుఱ్ఱా వాళ్ళకుండాలికదా! "ఎలాగో అలా సద్దగలడేమో ఓపాతికవేలు పంపించమని మీ అన్నయ్యకిఫోన్‌చెయ్యి" "మనకున్న దాంట్లో మనం సవ్యంగా బతక్కుండా తగలేసుకుని వాళ్ళ ముందూ వీళ్ళముందూ చెయ్యి జాపడం సిగ్గుమాలిన పని అని నా ఉద్ధేశ్యం" మెల్లిగా అతి మృదువుగా చెప్పింది సమాధానం. "ఏంకూశావ్?" మహేశ్వర్రావు చెయ్యిపైకిలేచింది.

"ఔన్లే... ఛీ వాళ్ళకి దానగుణం దయాగుణం ఎక్కడేడిశాయి? మాట్లాడవేం?" గద్దించాడు. జవాబు చెప్పడం తప్పనిసరైంది ఆమెకి.

"పాత్రత ఎరిగి దానం చెయ్యమన్నారు పెద్దలు. అపాత్రదానం చెయ్యొద్దన్నా రు. ఆ విషయం బాగా తెల్సినవాళ్ళు మావాళ్ళు. పైగా కీర్తికాంక్షతో రగిలిపోతున్న వాళ్ళుగానీ.. కీర్తికాంక్షతో సంసారానికి అన్యాయం చేస్తున్న వాళ్ళుగానీ మావాళ్ళల్లో ఎవ్వరూలేరు. పరోపకారానికి.... కీర్తికాంక్షకీ తేడా తెలియని పసిపిల్లని కాదుగా నేను...." పూజగదిలోకి వెళ్ళిపోయింది జగదాంబ మరక్కడనిలబడలేక. తాకట్టునించి విడిపించుకోలేక పోయిన ఇల్లు చెయ్యిదాటిపోయింది. అదే వీధిలో తెల్సినవాళ్ళ

ఇంట్లో ఒక పోర్షన్లో అద్దెకిదిగి అ తర్వాత కొద్దిరోజులకి పక్కవీధిలో డాబా ఇల్లొకటి ఖాళీ అయితే అందులోకి అద్దెకి చేరడం జరిగిపోయింది.

కాలేజి చదువులకొచ్చిన పిల్లలకి తండ్రి నిర్వాకాలు తెలిసొచ్చాయి. ఆయనిప్పుడు వాళ్ళకి శత్రువయ్యాడు. తల్లిమంచితనం అర్థమైంది. ఆవిడకి చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ తామరాకు మీది నీటిబొట్టులా ఉండిపోయింది జగదాంబ. ఒక్కసారంటే ఒక్కసారే కట్టిన బట్టలు కూడా తమవి తీసికెళ్ళి క్లబ్‌లో కుర్రాళ్ళకిచ్చేసి "అబ్బో! ఈ అయ్యగారంత గొప్పోళ్ళు, దానకర్ణులు ఇంకెక్కడాలేరు" అనిపించుకుని గర్వపడే తండ్రిని చూస్తుంటే చిర్రుత్తుకొస్తోందిప్పుడు పిల్లలకి.

"మీక్కావాలంటే మళ్ళీ కుట్టిస్తానుగా! ఎందుకలా ఇదైపోతారు?....."

"ఉన్న నాలుగు బట్టలూ ఇచ్చేసుకోవడం. ఎందుకూ? మళ్ళీ అప్పులు చేసి వెంటనే కుట్టించుకోడం ఎందుకు? అవేమన్నా పాతబట్టలా ఏవన్నానా? చెల్లాయివి మంచి కొత్తబట్టలూ, అమ్మవిమంచి చీరలూ కూడా ఎవరెవరి కోపట్టి కెళ్ళి ఇచ్చేస్తున్నారు. మీరు" పెద్దకొడుకు ధైర్యం చేసి అడగనే అడిగాడు. "అప్పులు చేసేది నేను. మధ్యన నీకెందుకు బాధ?" ఆ మాటకి మరింత ఒళ్ళుమండిపోయింది పెద్దకొడుకు చక్రధర్‌కి. నాకెందుకా? ఇప్పటికే ప్రతిరోజూ ఇంటి చుట్టూ అప్పుల వాళ్ళు తిరుగుతున్నారు. తలెత్తుకోలెక పోతున్నాను నా స్నేహితుల ముందు. ఏ చెడు అలవాట్లూ లేకపోయినా కీర్తి దాహంతో ఇల్లు గుల్ల చేసుకోవచ్చుని మిమ్మల్ని చూస్తే ఎవరికైనా తెలుస్తుంది."

"ఒరే ఒరే! నోటికెంతొస్తే అంతవాగుతావురా! నీతో మాట్లాడటం అనవసరంనాకు" కోపంగా బయటికెళ్ళిపోయాడు.

★★ ★★ ★★

లోపలికి వొచ్చి పోయేవారందర్నీ.... ఉలుకుపలుకులేకుండా శరీరంలో కదలిక లేకుండా.... కళ్ళప్పగించి చూస్తూనే ఉంది.. జగదాంబ... ముక్కలైన మనసులో ఒక్కటే ఆలోచన మిగిలింది ఇంక.... తన ఊపిరి ఆగిపోయాకైనా తనశవానికైనా తన కత్యంత ఇష్టమైన లేతాకు పచ్చరంగు చీర కట్టనిస్తాడా భర్త అనబడే ఈ చండశాసనుడు... ప్రశ్నరూపంలో ఈ ఆలోచన ఒక్కటే మిగిలింది ఇక ఆ మనసులో.

వారంరోజులకిందట ఆ చీర తన దిండు కింద పెట్టించుకుంది కూతురిచేత..... ఎందుకలా పెట్టమంటోందోకూతురికి చెప్పనేలేదు. మాటపోయింది ఆ పిల్ల కూడా అడగనే లేదు.

మళ్ళీ డాక్టరొచ్చాడిప్పుడు. పరీక్షచేసి... ఇక కొద్ది నిమిషాలే అని విచారం వ్యక్తం చేసి వెళ్ళిపోయాడు. మంచమ్మీంచిదింపి చాప మీద పడుకోపెట్టండని సలహా ఇచ్చారొక పెద్దాయన. గబగబాదింపుతుంటే పక్కమీదిదుప్పటి దిండు సగం కిందకి జారాయి. అవి సరిచేస్తున్న పనిమనిషి ఆదెమ్మ.... దిండుకిందనించి జారిన ఆ చీరనికూడా తీసింది. చిరాగ్గా చూశాడు మహేశ్వర్రావు...ఛ....ఛ.....

తనకస్సలిష్టంలేని రంగు...... "ఆచీరెవరు పెట్టారక్కడ? నువ్వు తీసుకుపో ఆదెమ్మా ఆ చీర". చటుక్కున ఆదెమ్మ చేతిలోంచి ఆ చీర తీసుకుంటున్న కూతుర్ని వింతగా చూశాడు.

"అమ్మకిప్పుడీ చీరకట్టిస్తాం" పిల్లల ముగ్గురి గొంతుల్లోంచీ ఒకేసారి మంత్రోచ్చారణలా వెలువడిన ఆమాటవిని తెల్లబోయి చూశాడు. జగదాంబ చూపులు పిల్లలమీద నిలిచాయి. వాళ్ళన్న ఆ మాట... ఆఖరి క్షణాల్లో ఉన్న ఆమె మనసుని సేద దీర్చిందన్న విషయం ఆ చూపుల్లో చక్కగా కనపడింది. ఆ మనసు సేద తీరిన ఆ క్షణాల్ని అలాగే పట్టిఉంచాలని.... గిల....గిల కొట్టుకుంటున్న ప్రాణం కదలకుండా టక్కున ఆగిపోయింది.

★★ ★★ ★★



కథానిలయం
కథానిలయం
విశాఖ 'ఎ' కోలనీ
శ్రీకాకుళం-532001